సాక్షి
మెదక్
సోమవారం, 15, జనవరి, 2024



కూలీలు దొరకట్లే..

వరినాట్లు వేయడానికి కూలీలు దొరక్కపోవడంతో జిల్లా వ్యాప్తంగా రైతులు ఆందోళన చెందుతున్నారు. వివరాలు 8లో ▸



జీవ వైవిధ్య సంరక్షకులకు సత్కారం

జీవ వైవిధ్యాన్ని కాపాడుతున్న మహిళా రైతులను పాత పంటల జాతరలో ఘనంగా సత్కరించారు. వివరాలు 8లో ▸



అయోధ్య అక్షింతల ఊరేగింపు

జిల్లాలోని పలు గ్రామాల్లో అయోధ్య రామ మందిర అక్షింతలను ఊరేగించారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

అదుపు తప్పి లారీ బోల్తా

డ్రైవర్ మృతి, క్లీనర్‌కు గాయాలు



బోల్తాపడిన లారీ



అజీజ్ (ఫైల్)

హవేళిఘణాపూర్(మెదక్): అతివేగంతో వస్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. క్లీనర్‌కు గాయాలయ్యా యి. ఈ సంఘటన మండల కేంద్రమైన హవేళిఘణాపూర్ ల్రెప్రసీ ఆస్పత్రి వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తూప్రాన్ నుంచి నాందేడ్ వెళ్తున్న లారీ తెల్లవారుజాము మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ అజీజ్(30) అక్కడికక్కడే మృతి చెందాడు. క్లీనర్ షేక్ రఫీకి గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. అజీజ్ మృతదేహాన్ని, క్షతగాత్రుడిని మెదక్ ఆస్పత్రికి తరలించారు. ఆ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏడుపాయలకు భక్తుల తాకిడి



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వన దుర్గమ్మ క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. భోగి పండగ పైగా ఆదివారం కావడంతో అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. పూజారులు శంకరశర్మ, పార్థివ శర్మ అమ్మవారికి అర్చన చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. యాత్రికులు మొక్కులు చెల్లించారు. ఆలయానికి వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చైర్మన్ బాలాగౌడ్, ఈఓ మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు.

ముగ్గురిపై కేసు నమోదు



వల్లభాపూర్‌లో విచారిస్తున్న నార్సింగి ఎస్‌ఐ అహ్మద్

చిన్నశంకరంపేట(మెదక్): పాత కక్షలతో దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు నార్సింగి ఎస్‌ఐ అహ్మద్ మోహినుద్దీన్ తెలిపారు. శనివారం రాత్రి నార్సింగి మండల కేంద్రానికి చెందిన మడుగుల దాసు, దాయం చందు, పుట్ట నరేష్ బైక్‌పై వల్లభాపూర్ గ్రామానికి వచ్చి గ్రామస్తుడు నూకల మల్లయ్యను తలుపుతట్టి బయటకు పలిచారు. అనంతరం వారి మధ్య మాటమాట పెరిగి దాడి చేసుకున్నారు. కాగా మల్లయ్య తనతో గొడవ పడి కత్తితో దాడికి పాల్పడ్డారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు విచారించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పండుగల విశిష్టతను తెలుసుకోవాలి

కొల్చారం(నర్సాపూర్): పండుగల విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా శారీరక్ శిక్షక్ మనోజ్ తెలిపారు. ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో మండలంలోని రంగంపేట.. ఉన్నత పాఠశాలలో సంక్రాంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మొదట భగవద్వజాన్ని ఎగుర వేసి ధ్వజ ప్రణామ్ నిర్వహించారు. మూడు రోజుల పండగ విశిష్టతపై ఆయన ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన నాయకులు గొండ కృష్ణ, రంగంపేట సంఘ్ కార్యవహా నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మర్కూక్(గజ్వేల్): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి అన్నారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా మర్కూక్ మండలంలోని వర్దరాజ్‌పూర్ గ్రామంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు.

సంబరాల సంక్రాంతి

జిల్లాలో పండుగ సందడి

- లోగిళ్లను రంగవల్లులతో తీర్చిదిద్దనున్న మహిళలు
- పిండి వంటల ఘుమఘుమలు
- చిన్నారుల పంతగుల సందడి

మెదక్: సంక్రాంతి పండుగను జరుపుకొనేందుకు జిల్లావాసులు సిద్ధమయ్యారు. పెద్దలు, చిన్నారులు తలస్నానాలు ఆచరించి నూతన వస్త్రాలు ధరించనున్నారు. మహిళలు తెల్లవారకముందే ఇంటి లోగిళ్లలో ముగ్గులను రంగవల్లులతో తీర్చిదిద్దనున్నారు. అందులో గొబ్బెమ్మలతో అలంకరించనున్నారు. పండగకు కొద్దిరోజుల నుంచే పిండి వంటలు వండుతున్నారు. అరిసెలు, బొబ్బట్లు, జంతికలు, సకినాలు, పాలతాలుకలు, సేమియా పాయసం, పరమాన్నం, పులిహోర, గారెలు మొదలయిన వంటకాలు వండుతున్నారు. మరోవైపు సందడికి కొదలే లేదూ.. గంగిరెద్దుల వారు బసవన్నలను చక్కగా అలంకరించి ఇంటింటికీ తిప్పుతూ, డోలు, సన్నాయి రాగాలకు అనుగుణంగా వాటితో చేయించే నృత్యాలు చూడటానికి చాలా రమణీయంగా ఉంటాయి. మనం ఇచ్చే కానుకలను స్వీకరిస్తున్నట్లుగా తలలు ఊపుతూ మోకాళ్ల మీద వంగి ధన్యవాదాలు తెలుపుతుంటాయి. అయ్యగారికి దండం పెట్టు, అమ్మగారికి దండం పెట్టు అంటూ గంగిరెద్దుల వాళ్లు సందడి చేయనున్నారు. అలాగే కొత్త ధాన్యం వచ్చిన సంతోషంతో మనం వారికి ధాన్యం ఇస్తే హరిలో రంగ హరీ అంటూ నడినెత్తిపై నుంచి నాసిక దాకా తిరుమణి పట్టెలతో, కంచు గజ్జెలు ఘల్లుఘల్లుమనగా చిందులు తొక్కుతూ, చేతుల్లో ఉన్న చిడతలు కొడుతూ, తలపై రాగి అక్షయపాత్ర కదలకుండా హరిదాసు ప్రత్యక్షమవుతాడు. ఇక చిన్నారుల సందడి సరేసరి. ఇప్పటికే వారు గాలి పటాలను ఇళ్లపైకి ఎక్కి ఎగరవేస్తూ ఆనందాన్ని స్నేహితులతో కలిసి వారు ఆస్వాదిస్తున్నారు.



ప్రత్యేక అలంకరణలో గంగిరెద్దులు

సంక్రాంతి పండగ నేపథ్యంలో ముగ్గుల పోటీకి ప్రాధాన్యతమిస్తారు. ఇటీవల మెదక్‌లో ఎమ్మెల్యే డాక్టర్ రోహిత్‌రావు సతీమణి శివానిరెడ్డి సిద్ధార్థ పాఠశాలలో ముగ్గుల పోటీ నిర్వహిస్తే మహిళలు పోటీల్లో ప్రతిభ చాటారు. వారికి ఆమె నగదు బహుమతులు, కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. నర్సాపూర్‌లో ఒక రాజకీయ నేత ముగ్గుల పోటీ నిర్వహిస్తే అందులో ప్రతిభ కనబర్చిన వారికి ఎమ్మెల్యే సునీతారెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. పండగకు పది రోజుల ముందు నుంచే పాఠశాలల్లో సైతం ఈ పోటీలను నిర్వహించారు.

➡ జిల్లాలోని హవేళిఘనాపూర్, నర్సాపూర్ మండలం మద్దులూరు, వెల్దుర్తి మండలం హస్తాల్‌పూర్, కొడిపల్లి మండలం సోమక్కపేటలో గంగిరెద్దుల కుటుంబాలున్నాయి. ఆంధ్ర తిరుపతిలో వారు ఎడ్లకు ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తారు. ఒక్కో దానికి రూ. 30 వేల నుంచి 50 వేల వరకు శిక్షణకే ఖర్చు చేస్తారు. శిక్షణ ముగిసిన అనంతరం ఆడించే వ్యక్తి వాటితో విన్యాసం వేయిస్తాడు. కాగా, జిల్లాలోని పలు గ్రామాల్లో ఉన్నటువంటి గంగిరెద్దుల కుటుంబాల వారు ఏటా వాటిని వెంటబెట్టుకొని హైదరాబాద్, నగరాలకు వలస వెళ్తుంటారు. ఈసారి కూడా అదే పట్టణాలకు తరలించి వాటిని అక్కడ ఆడిస్తూ జీవనం సాగిస్తున్నారు.



శిథిలమైన శివాలయం

శివశివా..!

- 120 ఏళ్ల నాటి శివాలయం నేలమట్టం
- పట్టించుకోని పురావస్తు శాఖాధికారులు

గతం ఒక జ్ఞాపకం.. భవిష్యత్ ఒక దిక్సూచి. ఈ విషయాన్ని మరువరాదు. ఒకప్పుడు పర్యాటకులకు ఆనందం, ఆహ్లాదాన్ని పంచింది. కాలగమనంలో శిథిలావస్థకు చేరి నేలమట్టమైంది. పురావస్తు శాఖాధికారులు విజిట్ చేసి పునర్నిర్మిస్తామని చెప్పారు. ఆచరణకు వచ్చేసరికి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగానే పరిస్థితి ఉంది. అదే ప్రసిద్ధి చెందిన తిప్పనగుల్ల శివాలయం.

రామాయంపేట, (మెదక్): నిజాంపేట మండలం తిప్పనగుల్ల గ్రామంలో 120 ఏళ్ల క్రితం నిర్మించిన శివాలయం నేలమట్టమైంది. ఆలయం ముందు భాగంలో ప్రతిష్ఠించిన నంది విగ్రహాలు రెండింటిని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. ఒక విగ్రహానికి తల పగల గొట్టి, మరొక దాన్ని ముళ్ల పొదల మధ్య పడవేశారు. శిథిలావస్థకు ముందు ఇక్కడ వందల సంఖ్యలో పర్యాటకులు వచ్చేవారు. ఆహ్లాదం, సంతోషం పంచేది. అలాంటిది ఇవాళ వెలవెలబోతోంది. కాగా పురావస్తు శాఖ అధికారులు సైతం ఆలయాన్ని పరిశీలించి పునర్నిర్మిస్తామని చెప్పి పట్టించుకోలేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఆలయానికి చెందిన కడీ రాళ్లను చెరువు కట్టకు వినియోగించారని అంటున్నారు. ఇదిలా ఉంటే.. నాడు తిప్పన్న అనే భక్తుడు శివాలయాన్ని నిర్మించాడు. ఆలయంతోపాటు అతి పెద్ద హైదర్ చెరువు (తిప్పన్న చెరువు) తవ్వాడని తెలిసింది. ఈ విషయమై నాటి తరం వృద్ధులు మాట్లాడుతూ అతను నాలుగైదేళ్ల పాటు శ్రమించి వందలాది మంది కూలీలతో పెద్దచెరువును తవ్వించాడన్నారు. ఇప్పటికీ మెదక్ నియోజకవర్గం పరిధిలోనే అతిపెద్ద చెరువు ఇదేనని, దీని కింద తిప్పనగుల్ల, నార్లాపూర్, కే.వెంకటాపూర్, కల్వకుంటల్లో 1,200 ఎకరాల మేర ఆయకట్టు ఉందన్నారు. చెరువులో మట్టిపూడికపోయి నీరు నిల్వ ఉండటం లేదని, దీంతో పంటలకు నీరు సవ్యంగా సరఫరా కావడం లేదన్నారు.

ఆలయాన్ని పునర్నిర్మించాలి



పూర్తిగా శిథిలమైన తిప్పన్న శివాలయాన్ని పునర్నిర్మించాలి. గతంలో ఎంతో ఆదరణ పొంది.. ఇవాళ పూర్తిగా శిథిలమవడం బాధాకరం.

చంద్రవర్ధిని, తిప్పనగుల్ల సర్పంచ్

బండెనక బండి కట్టి.. కొత్తకొండ బాటపట్టి..



హుస్నాబాద్‌రూరల్: తండాలన్నీ ఎడ్లబండ్లపై కదిలాయి. హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండలోని వీరభద్రస్వామి జాతరకు గిరిజనులంతా ఆదివారం తరలివెళ్లారు. వ్యవసాయ పంటలే జీవనాధారంగా గడిపే గిరిజనులు.. సంక్రాంతి పండుగ వేళ పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకొంటారు. వారు బంధువులు ఆప్తులు కలుసుకోవడానికి జాతరనే వేదికవుతుంది. పట్టణాలకు వలస వెళ్లినవారు, ఉద్యోగ రీత్యా అక్కడే స్థిరపడిన కుటుంబాలు సైతం ఇక్కడకు చేరుకుంటాయి. అందరూ పండుగ వేళ సంప్రదాయ నృత్యాలు చేస్తూ ఆనందంగా గడుపుతారు.

పిండి వంటలు.....

ఇంటికి వచ్చిన కొత్త ధాన్యంతో గిరిజనులు పిండి వంటలు చేస్తారు. మామూలుగా వరి పిండి, నువ్వుల మిశ్రమంతో సకినాలు, వరి పిండి పల్లీల మిశ్రమంతో గారెలు, పూస, గర్జెలు వంటి పిండి వంటల్లో.. బెల్లం పానకంతో తయారు చేసే అరిసెలు ప్రత్యేకం.

రెండు రోజుల తర్వాతనే ఇళ్లకు..

వీరభద్రస్వామి జాతరకు కుటుంబాలతో చేరుకుంటాం. అందరం రాత్రి అక్కడే ఉంటాం. రెండు రోజుల తరువాత ఇళ్లకు చేరుకుంటామని భల్లునాయక్ తండాకు చెందిన టీచర్ శారద చెప్పారు.

ఏసయ్యా.. నిన్నే కొలిచెదమయ్యా..





ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ సీఎస్‌ఐ చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు రెండు విడతల్లో ఆరాధనలు చేశారు. చర్చి ప్రెస్బిటరీ ఇన్‌చార్జి శాంతయ్య భక్తులకు దైవసందేశాన్ని ఇచ్చారు. దూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులకు చర్చి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. -మెదక్

పట్టాభూములకు పొజిషన్ చూపించరూ..

నాగ్సాన్‌పల్లి గ్రామ రైతుల వినతి

కౌడిపల్లి(నర్సాపూర్): పట్టాలిచ్చిన సాగు భూమికి పొజిషన్ చూపించాలని కౌడిపల్లి మండలం నాగ్సాన్‌పల్లి రైతులు అధికారులను కోరారు. ఆదివారం రైతులు అల్మాయపేట శ్రీనివాస్, ఒద్ది అంజయ్య, అల్మాయపేట అంజయ్య, సుమతి, సంతోష, చెల్ల నాగమ్మ, చెల్ల లక్ష్మి, చెల్ల భూదెమ్మ, నర్సమ్మ తదితరులు మాట్లాడారు. 2005లో ప్రధాని మన్మోహన్‌సింగ్ మెదక్‌కు వచ్చి గ్రామానికి చెందిన 40 మంది రైతులకు జీవనోపాధి కోసం సర్వే నంబర్ 93లో పట్టాలు ఇచ్చారన్నారు. ఇప్పటికీ ఇందులో ఉన్న 25 మందికి పొజిషన్ చూపించలేదన్నారు. వీరికి పట్టాపాస్ పుస్తకాలు ఉన్నా ఇండియన్ బేసిక్ బ్రీడర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పౌల్ట్రీ ఫాం యజమానులు ఆ భూమిలోకి అడుగుపెట్టనివ్వడం లేదని, పైగా కేసులు పెడతామని బెదరిస్తున్నారని విమర్శించారు. ఈ విషయమై ఎన్నో సార్లు రెవెన్యూ అధికారులు, కలెక్టర్ చుట్టూ తిరిగినా భూమికి పొజిషన్ చూపలేదన్నారు. ప్రస్తుతం పౌల్ట్రీ ఫాం యజమానులు ఈ ప్రాంతంలో చెట్లు నరికి సుమారు 20 ఎకరాల వరకు ఆక్రమించుకున్నారన్నారు. పౌల్ట్రీ ఫాంకు ఉన్న హద్దులను దాటి అటవీప్రాంతం భూమితోపాటు పెదానికుంట కట్టుకాల్వను పూడ్చి కబ్జా చేశారని ఆరోపించారు. ఈ కల్వ ద్వారా గ్రామ పెద్ద చెరువుకు నీళ్లు వచ్చేవని, 200 ఎకరాలు సాగయ్యేదన్నారు. ఇప్పటికైనా పౌల్ట్రీ ఫాం యజమానుల చెర నుంచి ప్రభుత్వ భూమిని రక్షించాలని, అందులోనే తమకూ పట్టాలు ఉన్నందున అధికారులు సర్వే చేసి పొజిషన్ చూపాలని కోరుతున్నారు.



పట్టాలను చూపుతున్న రైతులు

వైభవంగా గోదా రంగనాథుల కల్యాణం



గోదా రంగనాథుల కల్యాణం నిర్వహిస్తున్న ఆలయ ధర్మకర్త కిషన్ తదితరులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో ఉన్న వేంకటేశ్వర ఆలయంలో ఆదివారం వైభవంగా గోదాదేవి రంగనాథుల కల్యాణం జరిపారు. ముందుగా స్వామి అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించిన అనంతరం ఈ క్రతువు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గోల్కొండ కిషన్ రావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు రాజు, భిక్షపతి, మల్లయ్య పాల్గొన్నారు.

పాత పంటల సందడి

- డీడీఎస్ ఆధ్వర్యంలో నెలరోజులు ఉత్సవాలు
- చిరుధాన్యాల ప్రాధాన్యత, సాగుపై అవగాహన
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

జహీరాబాద్: పాత పంటల జాతర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం మొగుడంపల్లి మండలం జాడీమల్కాపూర్ గ్రామంలో ఉత్సవాలను సర్పంచ్ ఎస్.పెంటమ్మ ప్రారంభించారు. డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ(డీడీఎస్) ఆధ్వర్యంలో 24వ పాత పంటల జాతరకు పలువురు ప్రొఫెసర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వినోద్ పావురాల మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా డీడీఎస్ మహిళలు చిరుధాన్యాల సంరక్షణకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. వీరి కృషితోనే వాటి ప్రాధాన్యత ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతిని సాధించగలిగిందన్నారు. జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు చేస్తున్న ప్రయత్నం చాలా గొప్పదన్నారు. కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా గత ఏడాదిని ప్రటించడం సంతోషకమైన విషయమన్నారు. జాతీయ స్థాయిలో వీటి గురించి చర్చ జరగడానికి ఇక్కడి మహిళలు చేసిన ఉద్యమాలే కారణమన్నారు. వ్యవసాయంలో నైపుణ్యం సాధించడం, చిరుధాన్యాలను సంరక్షించుకోవడం పెద్దపనిగా పేర్కొన్నారు. గ్రామీణ ప్రజల తెలివితేటలు, జ్ఞానం అపారమన్నారు. మహిళల శక్తి సామర్థ్యాలు వారు చేస్తున్న పనిద్వారానే వెలుగులోకి వస్తుందన్నారు. చిరుధాన్యాల వ్యవసాయం నిలబడడానికి వారే కారణమన్నారు. మండల వ్యవసాయాధికారి వినోద్‌కుమార్ మాట్లాడుతూ జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు తమ వంతుగా కృషి చేస్తున్నామన్నారు. రైతులు జీవవైవిధ్య పంటలను పండించేందుకు తమవంతు పాటుపడుతున్నారని చెప్పారు. చిరుధాన్యాల ఆహారం ఆరోగ్యానికి మేలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి గుండారెడ్డి, ప్రొఫెసర్లు అపర్ణ రాజప్రోలు, వాసుకి బేలవాడె, యునెస్కో కమ్యూనిటీ మీడియా ప్రతినిధి కంచన్ మాలిక్, రైతు మల్లేశం పాల్గొన్నారు.



చిరుధాన్యాలతో ఎడ్లబండ్ల ప్రదర్శన

ప్రత్యేక స్టాళ్ల ఏర్పాటు

పాతపంటల జాతర ప్రారంభం సందర్భంగా ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశారు. కేవీకే ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయ విధానం, కషాయాల ప్రదర్శన నిర్వహించారు. ఆరోగ్య కార్యకర్తలు ఆయుర్వేద వైద్యం కోసం తయారు చేసిన ఉత్పత్తులు, చెట్ల మందులు, చిరు ధాన్యాల వంటకాలు, చిరుధాన్యాలు, ఆహార ఉత్పత్తుల స్టాళ్లను ఏర్పాటు చేశారు. వీటిని పలువురు సందర్శించారు.

అలరించిన ప్రదర్శనలు

మహిళా రైతుల కోలాటం, గిరిజన మహిళల నృత్యం, పురుషుల భజన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళా రైతులు తమ అనుభవాలను వివరించారు. చిరుధాన్యాల సాగుతో కలిగే ప్రయోజనాల గురించి తెలిపారు. సేంద్రియ వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలను రైతు మల్లేషం వివరించారు.



జాతరను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ వినోద్

చిరుధాన్యాల సాగును ముందుకు తీసుకెళ్తాం..

మిల్లెట్‌మెన్‌గా పేరుగాంచిన పీవీ సతీష్ మరణం బాధాకరమని డీడీఎస్ డైరెక్టర్ రుక్మిణీరావు అన్నారు. ఆయన ఆశయాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలన్నారు. మన పంటలను మనం కాపాడుకుందామన్నారు. చిరు ధాన్యాల సాగు చేజారకుండా కృషి చేద్దామన్నారు. మహిళలు చిరుధాన్యాల రక్షణకు చేస్తున్న కృషిని ప్రభుత్వం కూడా గుర్తించి చేయూతనందించాలని కోరారు. భూమిని కాపాడుకుంటూ పంట సాగును మరింత విస్తృతం చేయాలన్నారు. జాతరను మరింత ఉత్సాహంతో భవిష్యత్‌లో కూడా ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మహిళా రైతులపై ఉందన్నారు.

క్లుప్తంగా

సంక్రాంతి 'చిత్రం'



దుబ్బాక: సంస్కృతీ సంప్రదాయాలకు నిలువు టద్దంగా నిలుస్తున్న సంక్రాంతి పండుగ పర్వది నాన్ని ఉట్టి పడేలా ప్రముఖ చిత్రకారుడు మల్లిక్‌ సంక్రాంతి చిత్రాన్ని దుబ్బాకలో ఆది వారం ఆవిష్కరించారు. చిత్రంలో పండుగ శోభ ఉట్టిపడేలా తల్లీ కూతుళ్ల ముగ్గులు, చిన్నారుల పతంగుల ఎగురవేత, గంగిరెద్దుల ఆటలను అత్యద్భుతంగా తీర్చిదిద్దాడు.

ప్రమాదవశాత్తు పూరి గుడిసె దగ్ధం



దగ్ధమైన గుడిసె

నిజాంపేట(మెదక్‌): ప్రమాదవశాత్తు పూరి గుడిసె దగ్ధమైన ఘటన ఆదివారం తెల్లవారు జామున నిజాంపేట మండల పరిధిలోని వెంక టాపూర్‌(కె) గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గోపరి తులసమ్మ నర్సిం లుకు చెందిన పూరి గుడిసెలో ఒక్కసారిగా మంటలు చెలరేగి దగ్ధమైంది. దీంతో బియ్యం, బట్టలు, వంట సామగ్రి పూర్తిగా కాలిపో యాయి. సుమారు రూ.50 వేల వరకు ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు. రెక్కడితేనే గాని డొక్కాడని పరిస్థితిలో ఉన్న కుటుంబాన్ని ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరారు.

భర్తను హత్య చేయించిన కేసులో..

మరో ముగ్గురు నిందితుల అరెస్ట్‌, రిమాండ్‌

సిద్దిపేటకమాన్‌: హిజ్రాగా మారి తనను వేధి స్తున్నాడనే భర్తను హత్య చేయించిన కేసులో పరారీలో ఉన్న ముగ్గురు నిందితులను సిద్దిపేట వన్‌ టౌన్‌ పోలీసులు అరెస్ట్‌ చేసి, రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేట వన్‌ టౌన్‌ సీఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట బోయిగల్లికి చెందిన వేదశ్రీకి నాసర్‌ పూరకు చెందిన దరిపల్లికి వెంకటేశ్‌కు 2014లో వివాహమైంది. 2015లో వీరికి ఒక పాప జని ్మంచింది. కొద్ది రోజుల తర్వాత వెంకటేశ్‌ ప్రవ ర్తనలో మార్పు వచ్చి అమ్మాయిలాగా మారి భార్యకు దూరంగా ఉంటూ వచ్చాడు. కొద్ది రోజుల తర్వాత వెంకటేశ్‌ ట్రాన్స్‌జెండర్‌ (హిజ్రా) గా మారి భార్యను వేధించసాగాడు. ఈ క్రమంలోనే తనకు పరిచయం ఉన్న పట్టణా నికి చెందిన బోయిన రమేశ్‌, వ్యాపారి రమేశ్‌తో కలిసి హత్య చేయించింది. మొదట అనుమానాస్పద కేసుగా నమోదు చేసి విచార ణలో హత్యగా తేల్చిన విషయం తెలిసిందే. కేసును జనవరి 6న ఛేదించిన పోలీసులు అప్పుడే వేదశ్రీతోపాటు బోయిని రమేశ్‌, ఇప్పల శేఖర్‌ను అరెస్ట్‌ చేశారు. పరారీలో ఉన్న మురో ముగ్గురిని శనివారం అదుపులోకి తీసు కున్నారు. వీరిలో మంచిర్యాల జిల్లా శ్రీరాం పూర్‌ గ్రామానికి చెందిన పైతరి రమేశ్‌, కందు గుల సాయివంశీ, మంచిర్యాలకు చెందిన సల్లం నరేందర్‌ ఉన్నారు.

ఆటో, బైక్‌ ఢీ ఒకరికి గాయాలు



గాయపడిన మోహన్‌

కౌడిపల్లి(నర్సాపూర్‌): ఆటో, బైక్‌ ఢీకొనడంతో ఒకరికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన మండలంలోని ముట్రా జ్‌పల్లి గ్రామశివారులో ఆదివారం చోటు చేసుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివ రాల ప్రకారం.. తునికి హరిచంద్‌తండా పం చాయతీ దేవులతండాకు చెందిన విస్లావత్‌ మోహన్‌ బైక్‌పై వేరే గ్రామానికి వెళ్లాడు. అనం తరం ముట్రాజపల్లి వైపు నుంచి ఇంటికి వస్తు న్నాడు. మార్గమధ్యలో ఆటో, బైక్‌ ఎదురెదు రుగా ఢీకొన్నాయి. దీంతో మోహన్‌కు తీవ్రగా యాలు అయ్యాయి. బాధితుడిని నర్సాపూర్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విష మంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కి తరలించారు.

సంక్రాంతి సందళ్లు..



సిద్దిపేట పట్టణంలో రంగుల విక్రయాలు



జహీరాబాద్‌ : ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి పండుగ సందడి జోరుగా కనిపిస్తోంది. ఆదివారం భోగిని ఘనంగా జరుపుకున్న ప్రజలు నేడు సంక్రాంతి, రేపు కనుమను కూడా ఇదే స్థాయిలో జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. పట్టణాలతోపాటు మండలాల్లోని గ్రామాల్లో పండుగ శోభ సంతరించుకుంది. ఏ ఇంటి ముందు చూసిన రంగుల ముగ్గులే దర్శనమిస్తున్నాయి. యువతులు తీరొక్క ముగ్గులను తీర్చిదిద్ది గొబ్బెమ్మలతో అలంకరించారు. అలాగే చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ గాలిపటాలు ఎగురవేస్తూ సంబుర పడితున్నారు. మహిళలు ఇళ్లలో పిండి వంటలతో బిజీబిజీగా గడుపుతున్నారు. పట్టణాల్లోని వ్యాపారులు పండుగకు అవసరమైన సరుకులు విక్రయిస్తుండడంతో దుకాణాలన్నీ కిటకిటలాడుతూ కనిపిస్తున్నాయి. రంగులు, చెరుకుగడలు, పండ్లు, పూలు, గుమ్మడి కాయలు, అనుపకాయల, శనక్కాయలు, కాయగూరల వ్యాపారాలతో ఆయా పట్టణాల్లో పండుగ సందడి నెలకొంది. పంటలు పొలం నుంచి ఇళ్లకు చేరే సమయం కావడంతో ఈ సంక్రాంతి పర్వదినాన్ని రైతులు, రైతు కూలీలు సంతోషంగా జరుపుకుం టారు. ఉపాధి కోసం, ఉద్యోగ, వ్యాపార రీత్యా పొరుగు ప్రాంతాలకు వెళ్లిన వారు.. అలాగే అవసరాల కోసం పల్లెలను వీడి పట్టణాలకు నివాసాలు మార్చిన వారు సైతం సంక్రాంతికి వచ్చేశారు.



మెదక్‌లో గంగిరెద్దులతో బసవన్న



చేగుంట హనుమాన్‌ వీధిలో భోగి మంటలు వేస్తున్న యువతీయువకులు



పటాన్‌చెరుటౌన్‌ : పతంగి ఎగురవేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌ రెడ్డి.



సిద్దిపేట పట్టణంలో భోగి మంటలు ఆడుతున్న మహిళలు



సిద్దిపేట పట్టణంలో పతంగుల దుకాణం వద్ద సందడి

జీవ వైవిధ్య సంరక్షకులకు సత్కారం



జీవ వైవిధ్య సంరక్షకులను సన్మానిస్తున్న ప్రముఖులు

జహీరాబాద్‌: సేంద్రియ విధానంలో పంటలను పండించి జీవ వైవిధ్యాన్ని కాపాడుతున్న మహిళా రైతులను పాత పంటల జాతరలో ఘనంగా సత్క రించారు. ఆదివారం జాడీ మల్కాపూర్‌లో ప్రారం భమైన జాతరలో డీడీఎస్‌ తరఫున సిద్ధాపూర్‌ తం డాకు చెందిన సుమిత్రబాయిని సర్పంచ్‌ ఎస్‌.పెం టమ్మ, లచ్చునాయక్‌ తండాకు కమిలిబాయిని ఏడ వినోద్‌కుమార్‌, శంశల్లాపూర్‌కు చెందిన మల్లె నర్సమ్మను ప్రొఫెసర్‌ వినోద్‌ పావురాల, పొట్‌పల్లికి చెందిన సుకన్యను మొనిమయ్‌సిన్హా, తూంకుంటకు చెందిన మైబూబ్‌బీని అపర్ణ రాయపోలు సత్కరిం చారు. కార్యక్రమంలో ప్రముఖులు పాల్గొన్నారు.

ఓటమి రేపటి గెలుపునకు నాంది

సాఫ్ట్‌బాల్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు నేతి కైలాసం



నిజామాబాద్‌ బాలికల జట్టుకు బహుమతి అందజేస్తున్న కైలాసం

కొండపాక(గజ్వేల్‌): నేటి ఓటమీలు రేపటి గెలుపు నకు నాందీలుగా నిలుస్తాయని సాఫ్ట్‌బాల్‌ అసోసి యేషన్‌ జిల్లా అధ్యక్షుడు నేతి కైలాసం అన్నారు. మండల కేంద్రమైన కొండపాకలోని వేదా ఇంటర్నే షినల్‌ పాఠశాలలో స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆధ్వ ర్యంలో జరుగుతున్న సాఫ్ట్‌బాల్‌ రాష్ట్ర స్థాయి క్రీడలు ఆదివారం ముగిశాయి. ప్రథమ స్థానంలో బాలుర విభాగంలో మెదక్‌ జట్టు,ద్వితీయ స్థానం లో బాలికల విభాగం నిజామాబాద్‌ జట్టులు నిలి చాయి. ఈ సందర్భంగా కొలాసం మాట్లాడుతూ.. క్రీడారంగం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతుందన్నారు. చదువుకు ఎంత ప్రాముఖ్యత ఉందో క్రీడారంగానికి సైతం అంతే ప్రాముఖ్యతలు న్నాయన్నారు. బాలుర విభాగంలో 16 మంది, బాలికల విభాగంలో 16 మంది జాతీయ స్థాయికి ఎంపికయ్యారన్నారు. జనవరి 29 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు మహారాష్ట్ర, ఔరంగబాద్‌లలో జరు గుతాయన్నారు. క్రీడా పోటీలు ప్రశాంతంగా ముగి యడంతో ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. విజే తలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమం లో స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆర్గనైజింగ్‌ కార్యదర్శి సమ్మయ్య, జూనియర్‌ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం ఆఫీసర్‌ అమరేందర్‌రెడ్డి, స్పోర్ట్స్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్‌ రెడ్డి, పీఈటీల సంఘం జిల్లా అధ్యక్షులు తోట సతీశ్‌, పీఈటీ తదితరులు పాల్గొన్నారు.



ఈ ఫొటోలో కని పిస్తున్న రైతు దుబ్బాక పట్టణానికి చెందిన మల్లుగారి నర్సింహా రెడ్డి. సొం త పొలంతో పాటుగా ఇతరులది కౌలుకు తీసుకొని ఈ యాసంగిలో 20 ఎకరాల్లో వరి పంట సాగుకు సిద్ధం అయ్యాడు. అంతా దున్ని, ఒడ్లు పెట్టి నాటుకు సిద్ధం చేశాడు. నాట్లు వేసేందుకు 15 రోజులుగా తిరుగుతున్నా కూలీలు దొరకడం లేదు. పోసిన నారు ముదిరి పోతుందంటూ ఆవేదన వ్యక్తం చేస్తు న్నాడు. ఇది ఒక నర్సింహారెడ్డిదే కాదు జిల్లాలోని అందరు రైతులది ఇదే గోస.

కూలీలు దొరకట్లే!

- ముదిరిపోతున్న వరి నార్లు
- కూలీల కోసం తిరుగుతున్న రైతులు
- ఎకరా నాటుకు రూ.7 వేలకు పైగా పెరిగిన ఖర్చు
- జిల్లాలో 3.48 లక్షల ఎకరాల్లో సాగు

దుబ్బాకటౌన్‌: వరినాట్లు వేయడానికి కూలీలు దొరక్కపోవడంతో జిల్లా వ్యాప్తంగా రైతులు ఆం దోళన చెందుతున్నారు. ఈయేడు వర్షాకాలంలో సమృద్ధిగా వానలు పడడంతో చెరువులు, కుంటలు నిండాయి. భూగర్భ జలాల్లో పుష్కలంగా నీరుంది. యాసంగిలో పంటలు బాగా పండించాలన్న గంపె డాశతో జిల్లాలోని రైతాంగం పెద్ద ఎత్తున వరిసాగుకు ముందుకొచ్చారు. వరినాట్లు వేయడానికి కూలీల కొరతతో రైతులు పడరాని పాట్లు పడుతున్నారు.

1.10 వేల ఎకరాల్లో వరినాట్లు..

జిల్లాలో ఈ యాసంగిలో రికార్డు స్థాయిలో 3.48 లక్షల ఎకరాల్లో వరిసాగు అవుతుందని వ్యవసా యాధికారుల అంచనా ఉంది. ఇప్పటి వరకు జిల్లాలో 1.10 లక్షల ఎకరాల్లో వరినాట్లు వేయడం పూర్తి అయింది. ఇంకా 2.40 లక్షల ఎకరాల్లో వరినాట్లు వేయాల్సి ఉంది. 2023 యాసంగిలో జిల్లాలో 3.46 లక్షల ఎకరాల్లో వరిసాగు కాగా ఈ యాసంగిలో సుమారుగా గతంలో కంటే 2 వేల ఎక రాల్లో వరిసాగు ఎక్కువగా జరుగుతుందనే అంచ నాలో వ్యవసాయాధికారులు ఉన్నారు.

రూ.7 వేలకు పైగా ఖర్చు

ఇది వరకు ఎకరం నాటు వేసేందుకు రైతులకు రూ. 5 వేలలోపు మాత్రమే ఖర్చు అయ్యేది. ఈ యాసం గిలో మాత్రం కూలీలకు డిమాండ్‌ పెరగడంతో ఎక రానికి రూ.7 వేల నుంచి రూ.8 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఒక రోజుకు మహిళా కూలీకి రూ.400, పురుషుడికి రూ.700 ఇస్తున్నారు. కూలీల కొరతతో గ్రామాల్లో 10 మంది నుంచి 20 మంది వరకు మహిళలు జట్టుగా ఏర్పడి గుత్తకు ఎకరానికి రూ.5,500 నుంచి రూ.6,500 వరకు వేస్తున్నారు.



ముదిరిపోతున్న వరి నారు

అలాగే ఆటో ఖర్చు రైతే భరించాల్సి వస్తుంది. వానాకాలం కంటే 2 వేల వరకు ఎకరానికి రైతుపై భారం పడుతుంది.

40 రోజుల్లోపే వేయాలి

కూలీల కొరతతో జిల్లాలో రైతులు పోసుకున్న వరి నార్లు ముదిరిపోతున్నాయి. నెలరోజుల నుంచి 40 రోజుల్లోపు యాసంగిలో వరినాట్లు వేసుకోవాలి. ప్రసుత్తం నార్లు పోసుకొని 2 నెలలు దాటిపోతుం ది. అయినా కూలీలు దొరక్కపోవడంతో నారు ముదురుతుంది. ముదిరిన నారు వేస్తే దిగుబడిపై చాలా ప్రభావం పడే ప్రమాదం నెలకొంది. జిల్లాలో వందల మంది రైతులు ప్రతిరోజూ నాట్లు వేసే కూలీల కోసం తిరుగుతున్నా ఫలితం లేని పరిస్థితి దాపురించింది.

20 రోజులుగా తిరుగుతున్నా..



నాకున్న 4 ఎకరాల్లో నాటు వేసేందుకు 20 రోజులుగా తిరుగుతున్నా కూలీలు దొరుకుతలేరు. నార్లు ముదిరి పోతున్నాయి. ఏం చేయాల్నో తోస్తలేదు. ప్రతిరోజూ గుత్త లోల్ల దగ్గరికి పోయి ఎంతగా బతిమిలాడినా నాలు గైదు రోజులంటుండ్రు కానీ నాటేసేందుకు రావడం లేదు. ఇప్పటికే 40 రోజుల నారు దాటింది. ఎప్పుడు నాటేస్తనో ఏమో.

–పాతూరి పెద్ద లక్ష్మారెడ్డి, రైతు

యంత్రం వస్తనే వ్యవసాయం



వరినాటు వేసే యంత్రాలు వస్తే తప్ప భవిష్యత్‌లో వ్యవ సాయం చేయడం కష్టం. ఇప్పుడు నాటేసేందుకు కూలీలు దొరక్క చాలా ఇబ్బంది పడుతున్నాం. గుత్తకు వేయమన్నా రేపు, మాపు అంటుండ్రు నారు ముదిరిపోతుంది. పొలం దున్ని పెట్టి 10 రోజులు అవుతుంది. నాటు వేసేవారు దొరుకతలేరు. గిట్ల యితే ఎవసం చేయడం దండుగే.

–కేసుగారి స్వామి, రైతు

డిమాండ్‌ ఉన్న పంటలు వేయాలి



ఈ యాసంగిలో 3.48 లక్షల ఎకరాల్లో వరిసాగు అంచనా ఉంది. ఇప్పటివరకు కొంత మేరకు నాట్లు పూర్తి అయ్యాయి. గత యాసంగి కంటే 2 వేల ఎకరాలకు పైగా వరిసాగు పెరిగే అవకాశాలున్నాయి. రైతులకు కూలీల కొరత ఇబ్బందిగా తయారైంది. అందరూ వరి పంటనే కాకుండా మార్కెట్‌లో డిమాండ్‌ ఉన్న పంటలను సాగు చేసేకోవాలి.

– శివప్రసాద్‌, జిల్లా వ్యవసాయాధికారి

పురాతన ఆలయం.. పూర్వ వైభవం

- వరద రాజులస్వామి ఆలయానికి మహర్దశ
- రూ.10 కోట్లతో పునర్‌ నిర్మాణ పనులు
- తమిళనాడు విష్ణుకంచి తరహాలో ముస్తాబు
- తుదిదశకు చేరుకున్న పనులు

మర్కూక్‌(గజ్వేల్‌): దశాబ్దాల నాటి ఆలయం పూర్వ వైభవం సంతరించుకుంటోంది. 450 ఏళ్ల చరిత్ర కలిగిన ఆ దేవాలయం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుకుంటోంది. మాజీ సీఎం కేసీఆర్‌ చొరవతో కంచి తరహాలో వరదరాజుల ఆలయం పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయి. తెలం గాణ కంచిగా ప్రసిద్ధి చెందిన మర్కూక్‌ మండలం వర్ద రాజ్‌పూర్‌లోని వరద రాజులస్వామి ఆలయా నికి రూ.10 కోట్లతో పునరుజ్జీవన పనులు జరుగు తున్నాయి. గులాబీ నేత మాజీ సీఎం కేసీఆర్‌ గతం లో ఈ ఆలయాన్ని దర్శించుకొని నిధులు కేటాయిం చారు. దీంతో 2023 నుంచి ఆలయ నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

ఏటా జాతర..

ప్రతీ సంవత్సరం వైశాఖ పౌర్ణమి మే నెలలో వారం రోజులపాటు అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తారు. స్వామికి కల్యాణం, గరుడసేవ, బండ్ల ఊరేగింపు, రథోత్సవం కనుల పండువగా జరుగు తుంది. ఉత్సవాలను తిలకించేందుకు ఇతర జిల్లాల నుంచి భక్తులు తరలివస్తారు. స్వామివారిని దర్శిం చుకొని తమ మొక్కులు తీర్చుకొని తరిస్తారు.



నిర్మాణంలో ఉన్న ఆలయ గోపురం

కంచి తరహాలో..

తమిళనాడులోని విష్ణుకంచి ఆలయరీతిలో వరద రా జుల స్వామి ఆలయాన్ని తీర్చిదిద్దుతున్నారు. రూ.10 కోట్ల నిధులతో ఆలయ గోపురం, ముఖ ద్వారానికి రూ.70 లక్షలు, హనుమాన్‌ ఆలయ నిర్మాణానికి రూ.80 లక్షలు, పెద్దమ్మ తల్లి ఆలయా నికి రూ.81.50 లక్షలను అప్పట్లో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం మంజూరుచేసింది. ఆలయంలో బంగా రుబల్లి, తొండలను భక్తులు దర్శించుకోవడం ఆనవా యితీ. ఆలయంలో అధ్యయన మండపం, హోమశా లల నిర్మాణం, అలాగే పంచలోహ సమేత ధ్వజ పీఠం ప్రతిష్ఠించనున్నారు. పెద్దమ్మ తల్లి, హనుమాన్‌ ఆలయ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నా, ఇటీవల ఎన్నికల వల్ల పనులు నిలిచి పోయాయి.



వరద రాజుల ఆలయంలో నిర్మించిన త్రికలశ గోపురాలు

రూపురేఖలు మారిపోయాయి



మాజీ సీఎం కేసీఆర్‌ రాకతో మా గ్రామం రూపురేఖలు మారిపో యాయి. ఆలయ నిర్మాణంతోపాటు గ్రామానికి రూ.10 కోట్ల నిధులు మంజూరు చేశారు. వీధి లైట్లు, సీసీ రోడ్లు, మురుగు కాల్వలు నిర్మించాం.

– అప్పాల ప్రవీణ్‌, సర్పంచ్‌

ప్రభుత్వం మారడంతో..



అసెంబ్లీ ఎన్నికల వల్ల డిసెంబర్‌ నుంచి పనులు నిలిచిపోయాయి. ప్రభు త్వం మారడంతో పనులు జరగడం లేదు. ఇప్పటి ప్రభుత్వం మళ్లీ ఆలయ నిర్మాణ పనులను చేపట్టాలి. వచ్చే వైశాఖ జాతర ఉత్సవాలకు ఆలయాన్ని సర్వాంగ సుం దరంగా తీర్చిదిద్దాలని కోరుతున్నా.

– లక్కాకుల నరేశ్‌, మాజీ సర్పంచ్‌

వృద్ధుడు అదృశ్యం

మిరుదొడ్డి(దుబ్బాక): వృద్ధుడు అదృశ్యమైన ఘటన మండల పరిధిలోని కాసులాబాద్‌లో ఆదివారం చోటు చేసుకుంది. మిరుదొడ్డి ఎస్‌ ఐ నరేశ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామా నికి చెందిన రంగనబోయిన మల్లేశం (70) అనే వృద్ధుడు మతిస్థిమితం సరిగ్గా లేక రెండు రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్ళిపోయాడు. కుటుంబ సభ్యులు బంధుమిత్రుల వద్ద ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. వృద్ధుడి కుమా రుడు భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొండపాక(గజ్వేల్‌): రోడ్డు ప్రమాదంలో మతి స్థిమితం లేని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రమైన కొండపాక శివా రులో రాజీవ్‌ రహదారిపై చోటు చేసుకుంది. కుకునూరుపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణానికి చెందిన ఉప్పల వెంకటేశం(60) కొద్ది రోజుల నుంచి మతి స్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. ఈనెల 13వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ క్రమం లో ఆదివారం రాజీవ్‌ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృ తి చెందాడు. సమాచారం అందుకున్న పోలీ సులు మృతదేహాన్ని పరిశీలించగా మృతుడి జేబులో ఫోన్‌ నంబర్లతో బుక్‌ దొరికింది. దాని ప్రకారం కుటుంబ సభ్యులకు సమాచారం అం దించారు. మృతుడి భార్య వనజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.